నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 24 జనవరి 2024 | KARIMNAGAR

దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 23: కొండగట్టు అంజన్న క్షేత్రం కిక్కిరిసింది. సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రద్దీ కొనసాగుతున్నది. మంగళవారం రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు, పుష్కరిణిలో స్నానం చేసి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో దొంగల మర్రి నుంచి కొండగట్టు ఆలయం దాకా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం కాగా, పోలీసులు క్రమబద్ధీకరించారు. రద్దీ దృష్ట్యా ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఈవో టంకశాల వెంకటేశం, పాలక మండలి చైర్మన్ తిరుక్కోవళూర్ మారుతీస్వామి పర్యవేక్షించారు. కాగా, స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారని, వివిధ సేవల రూపంలో ఆలయానికి ₹12 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కాగా, అంజన్న సన్నిధిలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు తీర్థప్రసాదాలు అందజేయగా, అర్చకులు ఆశీర్వచనం చేశారు.

వాహనాలతో నిండిపోయిన పరిసరాలు

ఇక దూకుడే

- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నయా వ్యూహం
- అబద్ధాలు, అసత్యాలను తిప్పికొట్టడమే లక్ష్యం
- నియోజకవర్గాల వారీగా సైన్యం సిద్ధం
- నేడు కరీంనగర్ పార్లమెంటరీ స్థాయి సోషల్ మీడియా వారియర్స్ సమావేశం
- రాష్ట్రంలో మొట్టమొదటి మీటింగ్ ఇక్కడే
- దిశానిర్దేశం చేయనున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశం
- వేయి మందికి పైగా హాజరుకానున్న వారియర్స్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

కరీంనగర్, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించింది. అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిపింది. అయితే, గత ఎన్నికల సమయంలో ఇతర పార్టీలు కేసీఆర్ సర్కారుపై విషప్రచారం చేసి, ప్రజలను పక్కదారి పట్టేలా చేశాయి. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే పంథాను అనుసరించేందుకు పక్కా ప్లాన్ అమలు చేస్తున్నాయి. ప్రధానంగా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారానికి ఒడిగడుతున్నాయి. అయితే, అభివృద్ధిని మాత్రమే నమ్ముకొని ప్రజల ముందుకెళ్లిన బీఆర్ఎస్, అసత్యాలు, అబద్ధాలను తిప్పికొట్టడంలో వెనుక పడింది. ఇది జగమెరిగిన సత్యం. ఈ అసత్య ప్రచారం ముందు అభివృద్ధి ఓడిపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అసత్య ప్రచారంతోపాటు నిరాధార ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ ఓవైపు.. బీజేపీ మరోవైపు నేటికీ అదే బాటలో పయనిస్తున్నాయి. గత అసెంబ్లీ తరహాలోనే ఆ పార్టీలు, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ముందుకెళ్లే ప్లాన్ అమలు చేస్తున్నాయి.

బీఆర్ఎస్ నయా వ్యూహం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విషప్రచారానికి బ్రేక్ వేయాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. మరోసారి ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఇతర పార్టీలు సిద్ధమైన తరుణంలో నయా వ్యూహాన్ని సిద్ధం చేసింది. అబద్ధాలను సోషల్ మీడియా వేదికగా తిప్పి కొట్టడమేకాదు, వాస్తవాలను ప్రజల కండ్ల ముందుంచేందుకు కొత్త పంథాను ఎంచుకున్నది. అందుకోసం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో సోషల్ మీడియా వారియర్స్‌ను ఏర్పాటు చేసుకోవడంతోపాటు వారికి మార్గదర్శనం చేయబోతున్నది. ఆ మేరకు తొలి వారియర్స్ సమావేశాన్ని బుధవారం కరీంనగర్‌లో నిర్వహించబోతున్నది. కరీంనగర్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,69,040 మంది ఓటర్లు ఉండగా, ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 150 నుంచి 200 మంది సోషల్ వారియర్స్‌ను ఏర్పాటు చేసింది. వీరికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రోజంతా జరిగే ఈ సమావేశంలో అబద్ధాలు, అసత్యాలను తిప్పికొట్టడంపై నిర్దేశం చేయడంతోపాటు వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు వారియర్స్ చేయాల్సిన విధులను వివరించడంపై ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నారు.

వినోద్‌వైపు.. అందరి చూపు

మోదీ పదేళ్ల ప్రభుత్వంలో కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లపాటు పనిచేసిన బోయిన పల్లి వినోద్‌కుమార్ చెరగని ముద్ర వేశారు. 2014 ఎన్నికల్లో 2,04,652 ఓట్ల మెజార్టీతో గెలిచి, కరీంనగర్ పార్లమెంట్ చరిత్రలోనే భారీ మెజార్టీ సాధించిన ఎంపీగా రికార్డు సాధించారు. 2006 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై ఆనాడు ఉద్యమ నేత కేసీఆర్ 2,01,582 ఓట్ల మెజార్టీ సాధించారు. కరీంనగర్ పార్లమెంట్ చరిత్రలో చూస్తే అత్యధికంగా మెజార్టీ సాధించిన ఘనత ఈ ఇద్దరికి మాత్రమే దక్కుతుంది. మోదీ పదేళ్ల ప్రభుత్వంలో వినోద్‌కుమార్ ఐదేళ్లు, బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నారు. అయితే, వినోద్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమించి అనేక విజయాలు సాధించారు. మచ్చుకు కొన్నింటిని చూస్తే.. ₹104 కోట్లతో ఉప్పల్-బీజీగిరి షరీఫ్ రైల్వే స్టేషన్ పరిధిలో ఓవర్ బ్రిడ్జిని సాధించారు. కొత్త పల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌ను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభింప చేయడంలో

సిద్ధమైన వేదిక

పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, దూకుడు పెంచుతున్నది. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు సంబంధించి హైదరాబాద్‌లో వరుస సమావేశాలు నిర్వహించిన ఆ పార్టీ, ఇక నుంచి క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లేందుకు నయా వ్యూహాలను సిద్ధం చేసింది. అందులో భాగంగానే బుధవారం కరీంనగర్ పార్లమెంటరీ స్థాయి సోషల్ మీడియా వారియర్స్ సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహించబోతున్నది. రేకుర్తి రాజశ్రీగార్డెన్‌లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ మీటింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా నిర్వహించే ఈ సమావేశంలో వెయ్యి మందికి పైగా వారియర్స్ పాల్గొననుండగా, రామన్న దిశానిర్దేశం చేయనున్నారు.

విజయం సాధించారు. అత్యధికంగా జాతీయ రహదారులే కాదు, జాతీయ రహదారుల కార్యాలయాన్ని కరీంనగర్‌కు తేవడంలో కీలక పాత్ర పోషించారు. 216 కిలోమీటర్లున్న జగిత్యాల- కరీంనగర్- హుజూరాబాద్- వరంగల్ జాతీయ రహదారి, 165 కిలోమీటర్ల పొడవున్న కరీంనగర్- సిరిసిల్ల- పిట్లం రహదారి, 184 కిలోమీటర్లు గల సిరిసిల్ల- సిద్దిపేట- జనగాం- సూర్యాపేట, 130 కిలోమీటర్లున్న ఎల్కతుర్తి- సిద్దిపేట- మెదక్, అలాగే 131 కిలోమీటర్లున్న మొలంగూరు- చెల్లూరు- జమ్మికుంట- వావిలాల- భూపాలపల్లి వంటివి సాధించి చూపించారు. అలాగే, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, ఆయుష్ దవాఖానను మంజూరు చేయించారు. వీర్నపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని.. దేశంలోనే 7వ స్థానంలో నిలిపారు. కరీంనగర్‌లో తక్కువ జనాభా ఉన్నా తన పరిణితిని ప్రదర్శించి స్మార్ట్‌సిటీ కింద ఎంపిక చేయించారు. దేశంలో 50 నిర్భయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే.. అందులో కరీంనగర్‌లో ఒకటి ఏర్పాటు చేయించారు. ఇవేకాదు, రాజీవ్‌రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవేగా కేంద్రంతో గుర్తించేందుకు, అలాగే కరీంనగర్‌కు ఐఐటీ, నవోదయ స్కూల్ సాధించడానికి ఆయన నేటికీ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైనా ప్రజలతోనే ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం నిరంతరం కేంద్రంతో పోరాడుతూనే ఉన్నారు. అందుకే వినోద్‌కుమార్ అభివృద్ధి పంథా, విజన్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని, ఈ ఐదేళ్ల బండి సంజయ్ పాలనలో జరిగిన పనులను ప్రజలు కంపేర్ చేస్తున్నారు. వినోద్‌కుమార్‌వైపు మొగ్గు చూపుతున్నారు.

విజయాలు ఘనం.. చెప్పడంలో వైఫల్యం?

కేసీఆర్ సర్కారు హయాంలో ఉమ్మడి జిల్లా ఊహకు అందనంతగా విజయాలను సాధించింది. విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లు ఇలా అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి జరిగింది. అయితే, వాటిని ప్రజలకు వివరించడంలో బీఆర్ఎస్ దళం వెనుకబడిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేసినా.. వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లకపోవడం వల్లే నష్టం జరిగిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

ఉమ్మడి జిల్లాలో 14,54,569 ఎకరాల భూమి సాగుకు యోగ్యంగా ఉంటే.. 2014కు ముందు కేవలం 6,65,255 ఎకరాలు అంటే కేవలం 45.73 శాతం మాత్రమే సాగయ్యేది. మరో 54.27 శాతం భూమి పడావుగా ఉండేది. గడిచిన తొమ్మిదేండ్లలో కేసీఆర్ సర్కారు నిర్మించిన ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ కింద చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, ఎస్సారెస్పీపునర్జీవం వంటి పనులతో అదనంగా 7,27,968 ఎకరాల భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. రాష్ట్రం వచ్చేనాటికి ఉన్న సాగు విస్తీర్ణంతో పోలిస్తే 137 శాతం అదనంగా సాగు పెరిగింది. అలాగే 2014లో చూస్తే.. కేవలం 4,57,725 మంది రైతులే సేద్యం చేయగా, కేసీఆర్ ప్రభుత్వంలో ఆ సంఖ్య 9.25,343కి చేరింది. వ్యవసాయ ప్రగతికి ఇది అద్దం పడుతున్నా.. చెప్పుకోవడంలో మాత్రం వెనుకబడిపోయింది. చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పైపైకి చేరి సేద్యం పెరిగింది.

- కేసీఆర్ సర్కారు విద్యుత్ రంగంలో ఎవరూ ఊహించనటు వంటి విజయాలు సాధించింది. 2018 జనవరి ఒకటి నుంచి వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్‌ను అమల్లోకి తెచ్చింది. అలాగే, నాణ్యమైన విద్యుత్ కోసం ఉమ్మడి జిల్లాలో ₹650 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించింది. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం, విద్యుత్ ఉపకేంద్రాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, అంతర్గత లైన్ల నిర్మాణం, కొత్తగా ఉప కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి పనులు చేసింది. 2014లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 218 విద్యుత్ ఉప కేంద్రాలు మాత్రమే ఉండగా.. వాటి సంఖ్యను 351కు పెంచింది. పదేళ్లలో కొత్తగా 133 కొత్త విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. అదే, ట్రాన్స్‌ఫార్మర్లు చూస్తే.. 2014లో 53,247 మాత్రమే ఉండగా, వాటిని 78,958కు పెంచింది. అంటే ఈ పదేళ్లలో కొత్తగా 25,711 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. వీటితోపాటు కొత్తగా 79,198 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చింది.
- 2014కు ముందు ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి 3,28,645 ఉండగా, ప్రతినెలా ₹13.13 కోట్లు ఇచ్చేది. అదే కేసీఆర్ సర్కారు హయాంలో పింఛన్ల సంఖ్య 5,88,589కి పెంచి, ప్రతినెలా ₹125.38 కోట్లు ఇచ్చింది. పాత వాటితో పోలిస్తే 2,59,944 పింఛన్లు కొత్తగా ఇవ్వడంతో పాటు దాదాపు ₹112 కోట్లకుపైగా అదనంగా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది.
- కేసీఆర్ సర్కారు 2016 అక్టోబర్ 11న జిల్లాల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం మట్టింది. ఉమ్మడి జిల్లాను నాలుగు జిల్లాలుగా చేసి, పాలనను మరింత చేరువ చేసింది. కొత్తగా 17 మండలాలు, 193 పంచాయతీలు, మరో నాలుగు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసింది. వీటితోపాటు 8 మేజర్ గ్రామాలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు 12 కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసింది.
- చిన్న జిల్లాల ఏర్పాటు తర్వాత కార్పొరేటుకు దీటుగా సర్కారు వైద్యం అందుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖను బలోపేతం చేసింది. ఉమ్మడి జిల్లాలో 2016లో 77 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుంటే వాటిని 93కు పెంచింది. అప్పుడు అన్ని దవాఖానల్లో 1,342 బెడ్స్ మాత్రమే ఉండగా.. వాటిని 2,850కి పెంచింది. అప్పుడు సిబ్బంది 3,149 మంది ఉంటే.. ఆ సంఖ్యను 4,318కి పెంచింది. నాటి ప్రభుత్వాలు మెడికల్ విద్యను పట్టించుకోలేదు. కానీ, కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లాకో మెడికల్ కళాశాల వచ్చింది. ఈ కాలేజీల్లో ప్రతి విద్యా సంవత్సరం 500 మెడికల్ సీట్లకు అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నర్సింగ్ స్కూల్, నర్సింగ్ కాలేజీల్లో 240 మంది విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ దవాఖానల్లో ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగేలా చర్యలు తీసుకున్నది. ఒకప్పుడు అన్ని దవాఖానాల్లో కేవలం 2,400 మందికి మాత్రమే ప్రతి రోజూ ఓపీ చూడగా, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్య 5,600కు పైగా పెరిగింది. మాతా శిశు ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య ఊహించని రీతిలో పెరిగింది. 2016కు ముందు రోజుకు కేవలం 24 ప్రసవాలు జరిగితే, వాటిని 129 వరకు తీసుకెళ్లింది.

కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
కరీంనగర్	3,55,156
చొప్పదండి	2,33,188
మానకొండూర్	2,21,741
హుజూరాబాద్	2,49,722
హుస్నాబాద్	2,42,397
సిరిసిల్ల	2,44,532
వేములవాడ	2,22,304
మొత్తం	17,69,040

చలి తీవ్రత.. అంతంతే మామిడి పూత

- తోటలపై ప్రతికూల వాతావరణ ప్రభావం
- తేనెమంచు, తామర పురుగుతో మరింత నష్టం
- ఆందోళనలో మామిడి రైతులు
- సస్యరక్షణ చర్యలు పాటించాలని శాస్త్రవేత్తల సూచనలు
- పూత, కాయ పెరిగే దశలో జాగ్రత్తలు

గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామ శివారులో మామిడి చెట్లకు అంతంతే పూత

మూడేళ్లుగా నష్టాలు చూస్తున్న మామిడి రైతులకు ఈ యేడాదీ నిరాశే మిగిలేలా ఉన్నది. డిసెంబర్ చివరి నాటికి తోటలు పూత పూసి పిందె దశకు చేరుకోవాల్సి ఉన్నా.. ఈసారి మొగ్గ కూడా కట్టకపోవడంతో ఆందోళన కనిపిస్తున్నది. వాతావరణంలో మార్పులు, చలి తీవ్రత, పొగ మంచు ప్రభావం చూపుతుండగా, తోటల్లో 60 శాతం పూత మాత్రమే వచ్చింది. ఇదే సమయంలో అధిక చలితో తెగుళ్లు, చీడ పీడల ఉధృతి పెరిగింది. తేనెమంచు, రసం పీల్చే పురుగులు, బూడిద తెగులు కనిపిస్తుండగా, తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. లేకుంటే పూత, పిందె, కాయ దశల్లో ఎక్కువ నష్టం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటి నుంచి రెండు నెలల కాలం మామిడి పంటకు కీలకమైందని, ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

- జగిత్యాల, జనవరి 23 (నమస్తే తెలంగాణ)

జగిత్యాల జిల్లా మామిడికి పెట్టింది పేరు. వరి తర్వాత ప్రధాన పంట మామిడే. 35 వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. జగిత్యాల, రాయికల్, మల్యాల, కొడిమ్యాల, మేడిపల్లి, కోరుట్ల, సారంగాపూర్, గొల్లపల్లి మండలాల్లో ఎక్కువగా సాగవుతున్నాయి. జగిత్యాల మామిడి మార్కెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఇక్కడి నుంచే మామిడి పండ్లను ఎగుమతి చేస్తుండగా, ఏటా సుమారు ₹400 కోట్ల మామిడి వ్యాపారం సాగుతున్నది. ఎక్కువగా ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, కలకత్తా, ఛండీగఢ్, రాజస్థాన్, తదితర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నది.

- **తేనె మంచు పురుగు :** తేనేమంచు పురుగుతో కలిగే నష్టం ఎక్కువగా నవంబర్ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఉంటుంది. తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాడలు, పూలు, లేత పిందెల నుంచి విపరీతంగా రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల పూత, పిందె రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై కాస్మోడియం, మీలియేలా అనే శిలీంధ్రాలు పెరిగి, ఆకులు, పూత కాడలు, కాయలపై మసి ఏర్పడుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక కాయలు చిన్నవై రాలిపోతాయి. పెరిగిన కాయలపై మసి ఏర్పడి, నాణ్యతను కోల్పోవడంతో మార్కెటింగ్ కష్టమవుతుంది. పూత, పిందె సమయంలో ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. మిగతా సమయాల్లో ఈ పురుగులు చెట్ల మొదలు, కొమ్మల బెరడులోని పగుళ్లలో దాక్కొని ఉంటాయి. తోటల్లో కలుపు ఎక్కువ ఉన్నప్పుడు, మబ్బు పట్టినప్పుడు, గాలిలో తేమ శాతం ఎక్కువగా, ఉష్ణోగ్రత తక్కువగా నమోదైనప్పుడు ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగుల వల్ల 20 నుంచి వంద శాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

నివారణ : తోటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. లీటరు నీటికి ల్యాండసైహలొత్రిన్ 1 మిల్లీ లీటర్ లేదా మోనోక్రోటోఫాస్ 2.5 మిల్లీ లీటర్ చొప్పున కలిపి పూత మొదలయ్యే, పిందెలు తయారయ్యే సమయాల్లో పూత, ఆకులపైనే కాకుండా మొదట్లు, కొమ్మలపైన కూడా పిచికారీ చేయాలి. పూత పూర్తిగా విచ్చుకోకముందే స్ప్రే చేయాలి. పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేస్తే పుప్పొడి రాలి పరాగ సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశిస్తాయి. మొగ్గదశలో కనిపిస్తే కరాటే 5 ఈసీ లేదా కాన్ఫిడార్ 0.5 మిల్లీ లీటర్ లేదా థయోమిథాక్సామ్ (అక్టారా) 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే పూత, కాత సమయంలో తేనెమంచు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.

- **తామర పురుగులు :** తామర పురుగులు 2 మి.మీ పొడవుండి, జాలరువంటి రెక్కలు కలిగి సూక్ష్మంగా ఉంటాయి. ఇవి కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి, గోకి, రసాన్ని పీల్చేస్తాయి. దీంతో చిగురు ఆకులు చాలా చిన్నవిగా ఉండి ఆ తర్వాత రాలిపోతాయి. పిందె ఏర్పడే దశలో కాయపై చర్మాన్ని గోకి, బయటకు వచ్చిన రసాన్ని పీల్చి వేస్తాయి. ఇవి ఆశించిన కాయలపై రాతి మంగు లేదా ఏనుగు మంగు ఏర్పడి కాయ నాణ్యత పడిపోతుంది.

నివారణ : టర్మిడాల్ 1.5 మిల్లీ లీటర్ లీటరు నీటికి కలిపి నల్లపూత దశలో అంటే పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేయాలి. లేదా ల్యాండ సైహలోత్రిన్ 1 మిల్లీ లీటర్ లీటరు నీటికి కలిపి తెల్లపూత దశలో అంటే పూమొగ్గ దశలో పిచికారీ చేయాలి.

- **బూడిద తెగులు (పౌడరీ మిల్డ్యూ) :** బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్టపరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడల పై కనిపిస్తుంది. చలి ఎక్కువైన పరిస్థితుల్లో తెగులు తీవ్రమవుతుంది. తెగులు సోకిన బాగాలు నల్లగా మారిపోతాయి. ఆకులు, పూల కాడలు సక్రమంగా పెరగవు. తెగులుతో పంటకు 30 నుంచి 60శాతం వరకు పంట నష్టం కలుగుతుంది.

నివారణ : నీటిలో కరిగే గంధకం (సల్ఫర్) 3 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ (కాన్ఫ్ ఫ్లస్) 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కొమ్మల కత్తిరింపులు, సమగ్ర ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం సిఫారసుల మేరకు సకాలంలో పాటించాలి.

- **పూత బాగా రావాలంటే :** పూతకు డిసెంబర్ మంచి సీజన్ అయినా.. జనవరి, ఫిబ్రవరిలోనూ పూత వచ్చే అవకాశముంటుంది. పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై ట్రిపుల్19ను ఒక లీటర్‌కు 10 గ్రాములు, 2 ఎంఎల్ మోనోక్రోటోఫాస్‌ను ఒక లీటర్ నీటితో కలిపి, 3 గ్రాముల వెట్టేబుల్ సల్ఫర్‌ను ఒక లీటర్ నీటితో కలిసి పిచికారీ చేసుకోవాలి.
- **పిందె రాలకుండా :** పిందె రాలడాన్ని తగ్గించేందుకు 10 లీటర్ల నీటికి 2 మిల్లీ లీటర్ల ప్లానోఫిక్స్ కలిపి పూరెమ్మలు మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. లేదా 2, 4-డీ 10 పీపీఎం (1గ్రాము 2, 4-డీ పొడిని 100లీటర్ల నీటిలో కలిపి) ద్రావణాన్ని స్ప్రే చేయాలి.

ఎంపికైన నమూనాతో అభయ్‌రాజ్

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు రామారావుపల్లి హెచ్ఎం

రాయికల్, జనవరి 23: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రాయికల్ మండలం రామారావు పల్లె ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కడకుంట్ల అభయ్ రాజ్ ఎంపికయ్యారు. జగిత్యాల జిల్లా విద్యా శాఖ 19 నుంచి 21 దాకా వర్చువల్‌గా నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో అభయ్‌రాజ్ ప్రతిభచూపారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన సూపర్ సైన్స్ కిట్ బోధనోపకరణాలను ప్రదర్శించి, రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ తెలిపారు. కాగా, అభయ్‌రాజ్‌ను డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఎంఈవో గంగాధర్, మండల నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు అభినందించారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, సంజయ్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ వసంత, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కాంగ్రెస్‌వన్నీ దొంగ వాగ్దానాలే

- కాళేశ్వరంపై ఎందుకంత అసత్య ప్రచారం..?
- కక్ష సాధింపులకు భయపడేది లేదు.. ప్రతి విషయాన్ని తిప్పికొడుతాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 23: 'కాంగ్రెస్ వన్నీ దొంగ వాగ్దానాలే. 420 హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు చేసిందేమీ లేదు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని..? వారి దృష్టిని మరల్చేందుకు ఆ పార్టీ నాయకులు గత ప్రభుత్వంపై బురద జల్లడం, బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నరు. మేమొక్కటే చెబుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపులు, బెదిరింపులకు భయపడేదిలేదు. ప్రతి విషయాన్ని తిప్పికొడతాం' అని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ వసంతతో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'అది చేస్తాం.. ఇది చేస్తాం' అని కాంగ్రెస్ నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలు కూడా మార్పు కోరుకున్నారని, కానీ నేడు కాల్వలు, చెరువుల్లో నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు యూరియా కోసం మళ్లీ క్యూ కట్టే దుస్థితి దాపురించిందని చెప్పారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఎప్పుడు వస్తుందా..? అని అటు రైతులు, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఎప్పుడు ఇస్తారని..? ఇటు మహిళలు ఎదురుచూస్తున్నారన్నారు. ఇంకా పెంచిన పెన్షన్ ఇప్పుడిస్తరని మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. రైతుబంధు సాయం సీజన్ దాటిపోతున్నా అందలేదన్నారు.

కాళేశ్వరంపై అన్నీ అబద్ధాలే..

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రూ.90వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమో..? చెప్పాలని ప్రశ్నించారు. ఈ విషయంలో తాము ఏ విచారణకైనా సిద్ధమేనన్నారు. ప్రాజెక్టు ద్వారా ఎకరాకు కూడా నీరంద లేదని జీవన్‌రెడ్డి మాట్లాడుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గడిచిన నాలుగన్నరేండ్లలో తొమ్మిది పంటలకు నిరాటంకంగా ఒక్క ఎకరా ఎండకుండా నీరందించామని వివ